

## డ్రైవర్ నుంచి ..ఓనర్ అయ్యా..

గతంలో నేను ఇతరుల వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేది. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన దళితబంధు పథకంతో నా జీవితమే మారిపోయింది. మొదటి విడుతలో ఎంపికైన అర్హుల జాబితాలో నా పేరు ఉండడంతో ప్రభుత్వం నుంచి వచ్చిన రూ. పది లక్షలతో ట్రాక్టర్‌ను కొనుగోలు చేశా. సొంతంగా ట్రాక్టర్ ఉండడంతో వ్యవసాయ పనులతోపాటు ఇతర పనులను చేసుకుంటూ ఆర్థికంగా ఎదుగుతున్నా. ప్రస్తుతం ఎలాంటి ఆర్థిక ఇబ్బందుల్లేవు. ఇతరుల వద్ద పని చేయాల్సిన పరిస్థితే లేదు. నాలాంటి దళితుల అభివృద్ధికి కృషి చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటా.

**- గుమ్మడి సామేల్, జనగాం, పెద్దేముల్**

## దళితబంధును కొనసాగించాలి



దళితుల అభ్యున్నతి కోసం కేసీఆర్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా మొదటి విడుతలో ఎంపికైన చాలామంది లబ్ధిదారులు సొంతంగా వ్యాపారం.. వాహనాలు కొనుగోలు చేసి ఆర్థికంగా ఎదుగుతూ పదిమందికి ఉపాధిని కల్పిస్తున్నారు. ఇంత మంచి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తే ఎంతోమంది దళితుల జీవితాల్లో వెలుగులు నిండుతాయి. రెండోవిడుత నిధులను త్వరగా మంజూరు చేయాలి.

**-మోడె యాదయ్య, ఖుదావంద్‌పూర్, పరిగి టౌన్/మండలం**

## దళితబంధు నిధులను మంజూరు చేయాలి



దళితులను ఆదుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ తీసుకొచ్చిన దళితబంధు పథకాన్ని ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం యథావిధిగా కొనసాగించాలి. వెంటనే రెండో విడుతలో ఎంపికైన లబ్ధిదారులకు నిధులను మంజూరు చేసి వారి బతుకుల్లో వెలుగులు నింపాలి. మొదటి విడుతలో ఎంపికైన ఎంతో మంది సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. దళితబంధుతోనే దళిత కుటుంబాల అభివృద్ధి సాధ్యం. అందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేయాలి

**-కొప్పు కృష్ణ, కడ్తాల్ మండలం**

## ఉపాధినిచ్చిన దళితబంధు



కేసీఆర్ ప్రభుత్వం దళితబంధు పథకం ద్వారా రూ. పది లక్షలు అందించి నా కుటుంబాన్ని ఆదుకున్నది. గతంలో ప్రైవేట్ జాబ్ చేస్తూ అరకొర జీతంతో తీవ్ర ఇబ్బందులు పడేది. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.పది లక్షలతో గతేడాది కొడంగల్ పట్టణంలో అక్విరా డిజిటల్ ఎక్స్‌రే కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని.. ఆత్మాభిమానంతో బతుకుతూ కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసుకుంటున్నా. దళితబంధు పథకం రాకుంటే నైపుణ్యం ఉన్నా పెట్టుబడి పెట్టే ఆర్థిక స్థోమత లేక ప్రైవేట్ ఉద్యోగాలు చేయాల్సి వచ్చేది. దళితబంధు పథకం నాలాంటి ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపుతున్నది.

**-దస్తులు, అక్విరా డిజిటల్ ఎక్స్‌రే సెంటర్ యజమాని, చిల్‌ముల్‌మైల్వార్, బొంరాస్‌పేట, కొడంగల్**



# బంధువొచ్చేనా !

## ప్రభుత్వ నిర్ణయంపై ఉత్కంఠ

- 'దళితబంధు' కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు
- ప్రస్తుతం అకౌంట్లను ఫ్రీజ్ చేయడంతో అయోమయం
- రెండో విడుత అటకెక్కుతుందేమోనని ఆందోళన
- వికారాబాద్ జిల్లాలో మొదటి విడుతలో 358 మందికి దళితబంధు ఇచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- రెండో విడుతకు విడుదలైన రూ.60 కోట్లు వెనక్కి ?
- రంగారెడ్డి జిల్లాలో మొదటి విడుతలో 697 మందికి లబ్ధి
- రెండో విడుతలో 8వేల మందికి ఇవ్వాలని గత ప్రభుత్వ నిర్ణయం

రంగారెడ్డి, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : దళితుల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు పథకంతో జిల్లాలోని ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నిండాయి. మొదటి విడుతలో 697 కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున అందించిన సాయం వారి ఆర్థిక ఎదుగుదలకు ఎంతో దోహదపడింది. రెండో విడుతలో మరికొంతమందికి సాయం అందించాలని గత ప్రభుత్వం నిర్ణయించగా..ఎన్నికల కారణంగా బ్రేక్ పడింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తుందా? లేదా! అన్న దానిపై సందిగ్ధత నెలకొన్నది. గత ప్రభుత్వ హయాంలోనే లబ్ధిదారులు బ్యాంక్ అకౌంట్లను తెరవగా..ప్రస్తుత ఆ అకౌంట్లను ఫ్రీజ్ చేయడంతో దళిత కుటుంబాలు అయోమయంలో పడిపోయాయి. దళితబంధు పథకం కొనసాగింపుపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం దళిత కుటుంబాలు ఉత్కంఠతగా ఎదురు చూస్తున్నాయి.

### దళితుల ఆత్మగౌరవానికి ప్రతీకగా..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన దళితబంధు పథకం దళితుల దశను మార్చివేసింది. నిన్నామొన్నటి దాకా వ్యవసాయ కూలీలుగా, చిన్నాచితక పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకున్న వారికి ఈ పథకం ఆర్థిక భరోసా కల్పించింది. జిల్లాలో మొదటి విడుతలో 697 మందికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని గత ప్రభుత్వం మంజూరు చేసింది. దళారుల ప్రమేయం లేకుండా నిధులను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా అధికార యంత్రాంగం పనిచేసి విజయవంతంగా పథకాన్ని అమలుచేసింది. ఈ పథకంతో అద్భుత ఫలితాలు సైతం వచ్చాయి. ట్రాక్టర్, ఆటోట్రాలీ వంటి యూనిట్లతోపాటు వ్యవసాయ సంబంధిత యూనిట్లు, కోడిపిల్లల పెంపకం, మినీ డెయిరీ, డయాగ్నస్టిక్ ల్యాబ్, సెంట్రింగ్, పేపర్ ప్లేట్ల తయారీ వంటి యూనిట్లతో అనేక దళిత కుటుంబాలు తమ జీవితాలకు కొత్త బాటలు వేసుకున్నాయి. దళితుల ఆత్మగౌరవానికి ప్రతీకగా దళితబంధు పథకం నిలిచింది.

### రెండో విడుతపై సందిగ్ధత..

మొదటి విడుత దళితబంధు సక్సెస్ కావడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం రెండో విడుతలో మరిన్ని దళిత కుటుంబాలకు ఈ పథకం ద్వారా సాయం అందించాలని నిర్ణయించింది. నియోజకవర్గానికి వెయ్యి మంది చొప్పున జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో 8 వేల మందికి సాయం అందించాలని సంకల్పించింది. లబ్ధిదారుల ఎంపికను సైతం చేపట్టింది. కొంతమందితో అధికారులు అకౌంట్లు కూడా తెరిపించారు. తీరా..ఖాతాల్లో రూ.10 లక్షలను జమ చేసే సమయానికి అసెంబ్లీ ఎన్నికలు రావడంతో బ్రేక్ పడింది. ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ ప్రక్రియను కొత్త ప్రభుత్వం చేపట్టలేదు. లబ్ధిదారుల అకౌంట్లను ఫ్రీజ్ చేశారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేవెళ్లలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ దళితబంధు తరహాల్లోనే కొత్త పథకాన్ని తెస్తామని ప్రకటించింది. ఈ మేరకు అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే అటు దళితబంధు లబ్ధిదారులకు సాయాన్ని కొనసాగించకుండా..ఇటు కొత్త పథకంపై స్పష్టత ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. రెండో విడుతలో గత ప్రభుత్వం కొంతమంది అకౌంట్లలో జమ చేసిన నిధులు సైతం వెనక్కి వెళ్లినట్లు సమాచారం. త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.

## దళితబంధు కోసం ఎదురు చూస్తున్నా..



దళితబంధు పథకం దళితుల ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నది. జిల్లాలో మొదటి విడుత పూర్తి కాగా.. రెండో విడుతలో పథకం కోసం దరఖాస్తు చేసుకున్నా. అర్హుడిగా ఎంపికై రూ.పది లక్షలు వస్తే వ్యాపారం చేసుకుని బతుకుదామని ఎదురుచూస్తున్నా. కానీ.. ప్రభుత్వం మారిపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందో లేదోనని ఆందోళన చెందుతున్నా. దళితుల బాగు కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆ పథకాన్ని యథావిధిగా అమలు చేయాలి.

**- దస్తప్ప, దళితబంధు పథకం దరఖాస్తు దారు, కొడంగల్**

## యథాతథంగా అమలు చేయాలి



దళితబంధు పథకాన్ని నిరంతరంగా కొనసాగించాలి. ఆ పథకం ద్వారా దళితులు ఆర్థికంగా ఎదుగుతారు. నేను కూడా రెండోవిడుతలో దళితబంధు పథకానికి దరఖాస్తు చేసుకున్నా. కానీ ఇంత వరకు దళితబంధు నిధులు రాలేదు. వాటిని ఫ్రిజ్ చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి దళితల బాగుకోసం గత సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ఆ పథకాన్ని యథాతథంగా కొనసాగించి మా బతుకుల్లో వెలుగులు నింపాలి.

**-బోడబందెప్ప, పెద్దేముల్**

# దళితబంధుపై నీలినీడలు

### వికారాబాద్ జిల్లాకు రెండో విడుతలో విడుదలైన రూ.60 కోట్లు వెనక్కి..?

వికారాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): దళితుల జీవితాల్లో వెలుగులు నింపే దళితబంధు పథకం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసి దళిత కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసిన దళితబంధు పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా లేదా అనే దానిపై సందిగ్ధత నెలకొన్నది. ఇటీవల స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తోపాటు జిల్లా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్ని శాఖల జిల్లా అధికారులతో జరిగిన సమావేశానికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీని హాజరు కావాలని ఆదేశించకపోవడాన్ని గమనిస్తే దళితబంధును నిలిపేసే ఆలోచన ఉన్నట్లు తెలుస్తున్నది. దళితబంధు పథకాన్ని రద్దు చేస్తారని ప్రచారం జరుగుతుండడంతో దళిత కుటుంబాలు కలెక్టర్‌తోపాటు సంబంధిత అధికారులకు దళితబంధు పథకాన్ని కొనసాగించాలంటూ వేడుకుంటున్నాయి. అయితే ప్రభుత్వం మాత్రం దళితబంధు పథకం కొనసాగింపుపై సానుకూలంగా లేనట్లు తెలుస్తున్నది. ఇప్పటికే సంబంధిత అధికారులకు దళితబంధు పథకం అమలుకు సంబంధించి కొత్తగా ఎవరికీ దళితబంధు ఆర్థిక సాయం చేయొద్దని (స్టేటస్ కో) ప్రభుత్వం ఆదేశించింది. దీంతో దళితబంధు పథకానికి సంబంధించి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని దళిత కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. మరోవైపు ఈ పథకంలో భాగంగా మొదటి విడుతలో ఎంపికైన లబ్ధిదారులు నచ్చిన వ్యాపారాలు చేసుకునేందుకు ఎలాంటి షరతుల్లేకుండా రూ.10 లక్షలను బీఆర్ఎస్ ప్రభుత్వం అందించడంతో వారు ఆర్థికంగా ఎదుగుతున్నారు. అయితే రెండో విడుత ప్రక్రియను షురూ చేసే సమయంలోనే ఎన్నికల షెడ్యూల్ రావడంతో లబ్ధిదారుల ఎంపికతోనే నిలిచిపోయింది. అదేవిధంగా రెండో విడుత దళితబంధు పథకం అమలుకోసం జిల్లాకు గత ప్రభుత్వం రూ. 60 కోట్లను విడుదల చేసింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకం అమలుకు సానుకూలంగా లేకపోవడంతో దళితబంధు పథకం అమలుకు విడుదలైన రూ.60 కోట్ల నిధుల మళ్లింపు జరిగిందనే ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే రూ.40 కోట్లను వెనక్కి తీసుకున్నట్లు సమాచారం. మరీ దళితబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా..లేదా అనేది స్పష్టత రావాల్సి ఉన్నది. కాగా మొదటి విడుతలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 358 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా, జిల్లాకు రూ.35.80 కోట్ల నిధులు విడుదలయ్యాయి. 358 యూనిట్లకు సంబంధించి జిల్లా యంత్రాంగం గ్రౌం డింగ్ చేసింది. వికారాబాద్ నియోజకవర్గంలో 100 మంది లబ్ధిదారులు, తాండూరులో 100, పరిగిలో 80, కొడంగల్‌లో 60, చేవెళ్ల నియోజకవర్గంలో 18 యూనిట్ల గ్రౌండింగ్ చేశారు.

## బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ గెలిస్తే దళిత బంధు వచ్చేది.



దళితబంధు పథకం కింద చిన్న వ్యాపారం ఏర్పాటుచేసుకుని ఆర్థికంగా ఎదుగుదామని అనుకున్నా. అందుకోసం రెండోవిడుతలో దరఖాస్తు కూడా చేశా. కానీ.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఈ పథకాన్ని కొనసాగుతుందా..లేదా.. అనే ఆందోళన మొదలైంది. దళితబంధు వస్తుందని ఆశించిన వారంతా నిరాశకు గురయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా దళితబంధు పథకాన్ని యథాతథంగా అమలు చేసి రెండో విడుత లబ్ధిదారులకు న్యాయం చేయాలి. దళిత కుటుంబాలకు అండగా ఉండాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి ఉంటే దళితబంధు వచ్చేది.

**-రామగల్ల కుమార్, సురంగల్, మొయినాబాద్**



దళితబంధు పథకం కింద మంజూరైన ట్రాక్టర్ తాళం చెవిని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ చేతులమీదుగా అందుకుంటున్న జంగయ్య (ఫైల్)

## దళితబంధుతో ట్రాక్టర్ తీసుకున్నా..

దళితుల ఆర్థిక ఎదుగుదలకోసం మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన దళితబంధు పథకంతో ఎంతోమంది లబ్ధిదారులు ఆర్థికంగా ఎదుగుతున్నారు. దళితబంధు పథకం ద్వారా వచ్చిన రూ. 10 లక్షలతో ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి దానిని నడుపుకొంటూ జీవనోపాధిని పొందుతున్నా. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందుల్లేకుండా కుటుంబంతో హాయిగా ఉన్నా. దళితులు, అన్ని వర్గాల ఆర్థికాభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. దళితబంధు పథకాన్ని కాంగ్రెస్ సర్కార్ కూడా కొనసాగించి.. అండగా నిలవాలి.

**-షాద్‌నగర్‌రూరల్**

## గొప్ప పథకం.. దళితబంధు

దళితబంధు గొప్ప పథకం. నాలాంటి ఎంతోమంది దళితుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నది. ప్రభుత్వం లబ్ధిదారులకు అందించే రూ. పది లక్షలతో సొంతంగా వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడంతోపాటు.. మరి కొంతమంది వాహనాలను కొనుగోలు చేసి జీవితాల్లో స్థిరపడుతున్నారు. మొదటి విడుతలో దళితబంధు పథకం కింద ప్రభుత్వం నుంచి రూ.పది లక్షలు రావడంతో సొంతంగా కారును కొని దర్జాగా బతుకుతున్నా. ఇప్పుడు ఇతరుల వద్ద పని చేయాల్సిన పరిస్థితి తప్పింది. అంతేకాకుండా కుటుంబం కూడా చాలా సంతోషంగా ఉన్నది. ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయాయి. నా కుటుంబాన్ని ఆదుకున్నా బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటా. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని కొనసాగిస్తే నాలాంటి ఎంతోమంది దళిత సోదరులు ఆర్థికంగా ఎదుగుతారు.

**- జోగు బాల్‌రాజు, దళిత బంధు లబ్ధిదారుడు, కొత్తూరు మున్సిపాలిటీ**







## దళితబంధుతో ఆర్థికంగా ఎదుగుతున్నా..

బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం దళితుల ఆర్థిక ఎదుగుదల కోసం తీసుకొచ్చిన దళితబంధు పథకం చాలా బాగున్నది. ఈ పథకం ద్వారా వచ్చిన రూ. 10 లక్షలతో కారు కొనుగోలు చేశా. అప్పటి నుంచి సొంతంగా డ్రైవింగ్ చేసుకుంటూ జీవిస్తున్నా. దీంతో ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయాయి. ఇప్పుడు కుటుంబంతో సంతోషంగా జీవిస్తున్నా. దళితబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగించాలి. రాజకీయాలకతీతంగా వెంటనే రెండో విడుత లబ్ధిదారులకు నిధులను విడుదల చేసి ఆదుకోవాలి.

**నర్సింగ్, దళితబంధు లబ్ధిదారు, షాద్‌నగర్**